

# అవతారమూర్తి

ప్రకాశం

సాయంకాలం ఆఫీసువర్కు పూర్తి కాగానే, చల్లగాలికి ఎటన్నా పోదా మనిపించింది. పార్కుకు వెళ్ళాను. అయినా ఒంటరితనం నన్ను బాధించింది. జనం పార్కునిండా వున్నా, ప్రతి ముఖం దేనికోరకో వెలిగా, వెలితిగా అవుపించింది. నీరసంగా నారింజచెట్ల కొమ్మలు అటూ యిటూ వూగుతున్నాయి. రేడియోలో కృష్ణ కాలవలోని నీటికొలతలు, అనంతపూర్‌లోని ఎండ ఉద్ధృతాన్ని గురించిన వార్తలు చెపుతున్నారు. అనంతపూర్‌ను గురించి చెప్పటానికి 'ఎండ' కన్న ఇంకేమీ వార్తలులేవా అనిపించింది. ఆగ్నేయపు మూలనివున్న సిమెంటు బెంచీదగ్గరకు నేలమీది గరికను తన్నుకుంటూ వెళ్లాను. నాకన్న ముందుగానే ఆ బెంచీమీద ఎవరో కూర్చునివున్నారు. జేబుగుడ్డతో బెంచీ ఒకవేపు చివర దుమ్ముదులిపి కూర్చున్నాను. నా ప్రక్కన కూర్చున్న వ్యక్తి ఎన్నో కష్టసుఖాల్ని కాచి వడపోసిన అనుభవజ్ఞుడిలా అవుపించాడు. నలభైయేళ్ళ వయస్సువుంటుంది. తలమీది వెంట్రుకలు, తెలుపు నలుపు కలిసిన మిశ్రవర్ణంగా అవుపించాయి. ఒంటిమీద వున్న ముతకవస్త్రాలు ఆయనలోని ఏవో అంతరంగిక విలువల్ని తెలియజేస్తున్నాయి. నన్నుచూడగానే కొత్త అనే సంకోచం ఏమాత్రం [illegible] 'కూర్చోండి' అన్నాడు. నేను అతని [illegible]గోలుతనాన్ని కొంతశ్రమతో భరించగలిగాను.

ఆ అపరిచిత వ్యక్తి స్వరాన్ని కొంతవరకు మార్దవంగా మార్చుకుని అన్నాడు : 'మిమ్మల్ని ఎక్కడో చూచినట్టు జ్ఞాపకం అండి. దుంపతెగ, ఫలానాచోట అని చెప్పలేక పోతున్నాను.'

అతనివేపు సాలోచనగా చూచాను—ఇదివరకు ఎక్కడైనా చూచానా అని. లోగడ ఏ ప్రదేశంలోను, ఏ సందర్భంలోను కలుసుకున్నట్లు గుర్తు రాలేదు. 'మిమ్మల్ని ఎక్కడా చూచినట్టు గుర్తు రావటంలేదండి' అన్నాను.

పెద్దమనిషి ఒకటిరెండు నిమిషాలు అంతర్ముఖంగా ఆలోచించి, నావేపు పరిశీలనగా చూచి అన్నాడు: 'మీరు ఆంధ్ర బ్యాంకిలో పనిచేస్తున్నారు కదూ ?'

'అవును' అని అతణ్ణి తిరిగి చూచాను—నేను అప్పటికన్నా గుర్తుపట్టగలుగుతానేమో నని.

'అయితే నన్ను ఎరగనంటారేమిటి? నా పేరు సత్యనారాయణండీ.'

'క్షమించండి. నాకు మీరు ఎవరో యింతవరకు గుర్తురానందుకు చాలా ఇదవుతున్నాను.'

సత్యనారాయణగారు నాలోని జ్ఞాపకశక్తి క్షీణతకు తన నిరసన తెలుపుతున్నట్లు కొద్దిగా నవ్వి అన్నాడు: 'నన్ను ఎరగనంటారేమిటండీ. ఆంధ్రదేశం అంతా మూలమూలల్లో నన్ను ఎరుగని వ్యక్తి అంటూవుండడు.'

అలాంటి ఘనకీర్తి నందినవారిని మరిచిపోవటమే కాకండా, తిరిగి గుర్తుతెచ్చుకోనంత అధోగతిలోకి పడిపోయినందుకు, నాకు చాలా లజ్జ కలిగింది. నా బ్యాంకిగుమాస్తా వుద్యోగం దగ్గరనుంచి నాచేతులోని జేబుగుడ్డవరకు, నాకుచెందిన ప్రతి వస్తువుమీద అసహ్యం పుట్టింది. బ్యాంకిలో ఎవరి పేర ఎంతడబ్బువుందో, ఎవరు ఎంతబాకీవున్నారో ఎకౌంట్ బుక్ చూడకుండా చెప్పగలను. నా జ్ఞాపక

[illegible] నాకు ఇలాంటి అన్యాయం చేస్తుందని ఎప్పుడూ అనుకోలేదు..

“దయచేసి మీరు ఏం చేస్తుంటారో చెప్పండి. మీలాంటి వారిని గుర్తుపట్టలేక పోయినందుకు క్రుంగిపోతున్నాను” అన్నాను.

ఆ శేషఆంధ్రుల్లో నాలాంటి ఒక సాధారణ గుమాస్తాతన్ను గుర్తించలేకపోతేమాత్రంఒకలెక్కా అన్నట్టు, సత్యనారాయణగారు, జేబులోనుంచి చుట్టతీసి, అంటించి పొగ ఒదులుతున్నాడు.

“మీరు ఏం చేస్తుంటారోచెప్పి నాకు కొంత శాంతి కలిగించండి.” సత్యనారాయణగారు సావధానంగా పొగపీలుస్తున్నాడు. ఆ ముఖంలో సంతోషచ్ఛాయలు అవుపించాయి. నాకేదో విశదీకరించ బోతున్నాడనే సంతోషం నాలో ప్రజ్వలించింది.

“నా జీవితం మొదట్లో ఒక గొప్ప రచయితగా ప్రారంభంఅయింది. ఆ రోజుల్లో రచయిత సత్యనారాయణగారు అంటే ఎరగని ఆంధ్రుడు లేడంటే, నమ్మండి” సత్యనారాయణగారు అన్నాడు. జీవితంలో ఎన్నడు పత్రికలు, కథలు చదివి ఎరుగని నేను అతను ఏ కథలు ఎంత రసవత్తరంగా వ్రాశాడో ఎలా చెప్పగలను? అతణ్ణి ఒక గొప్ప రచయితగా వూహించుకుని, ఏ విధంగా సంతృప్తిచెందగలను? “నాకు మీరు ఇంకా గుర్తురాలేదండీ” అన్నాను. అతనికి నాయందు ఏ మాత్రం కోపంగాని, విసువు గాని జనించలేదు. ఇంకా పట్టుదల, సహనం అతనిలో అవుపించాయి. అతను నాకు గుర్తురావటానికి మరికొన్ని గుర్తులు వివరించాడు. “కొంత కాలం జరిగాక, రచనలు చేయాలనే వుత్సాహం తగ్గింది. ప్రజానీకానికి ఇతోధికంగా సేవచేయాలని కాంగ్రెసులో చేరాను; కాంగ్రెసు ఆశయాల్ని ప్రచారంచేస్తూ, దేశం నలుమూలలా తిరిగి, నా శక్త్యానుసారంగా సేవచేశాను. అందువల్ల దేశంలో నాకు పలుకుబడి, ప్రతిష్ఠ పెరిగేయి. ప్రజల్లో నేను అందరికి పరిచయం అయినాను. బహుశా అప్పట్లో మీరు కూడా నన్ను గురించి వినివుండవొచ్చు. ఇప్పటికైనా గుర్తొచ్చివుంటాను, అవునా!’ అన్నాడు. నా రాజకీయఅల్పపరిజ్ఞానానికి, ఎంతసేపటికి నెహ్రూ, పటేల్,’ పట్టాభి గార్లే గుర్తువొచ్చారు. నా జ్ఞాన తంతువుల్లోనుంచి పైనాయకుల రూపాల్ని నెట్టేసి, ఎదురుగావున్న సత్యనారాయణగారి మూర్తిని ప్రవేశింపచేతామంటే, నావల్ల కాలేదు.

‘నాకు ఇంకా జ్ఞప్తికిరాలేదండి’ గొంతును ఖేదంగామార్చుకుని తలవొంచుకుని అన్నాను.

సత్యనారాయణగారు తిరిగి అన్నాడు: ‘కొంత కాలానికి, కాంగ్రెసులో నాకు చాలా అవినీతి అవుపించింది. నా మనస్సు స్త్రీల సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. సమాజాన్ని సంస్కరించాలనే పట్టుదలతో, కొన్ని సమస్యల్ని తీసుకుని, దేశవ్యాప్తమైన వుద్యమం నడిపాను. స్త్రీల స్వాతంత్ర్యంకొరకు ఎన్నో త్యాగాల్ని చేశాను. నా పేరును పత్రికలు దేశంలో వాడవాడలకు తీసుకెళ్ళేయి.’

‘పోనీ మీరు నాకు గుర్తొచ్చేట్టులేదు, నన్ను క్షమించండి’ అన్నాను-అతనికి అధికంగా శ్రమ కలిగించటం ఇష్టంలేక.

‘ఇంతమాత్రానికే మీరెందుకు అలా నిరాశ పడటం. నేను గుర్తొచ్చేట్టు చేస్తాగా, నన్ను ఎరుగని ఆంధ్రుడంటూ వుండరాదని నా పట్టుదల’ అని సత్యనారాయణగారు, తన జీవితంలోని మరి కొన్ని త్యాగాల్ని స్ఫురణకు తెచ్చుకోనారంభించాడు. సుమారు పావుఘంట గడిచింది. రేడియోలో ఎవరో, గీతాల్ని వినిపిస్తున్నారు. చల్లని గాలి వస్తోంది. స్తబ్ధంగా పార్కులోజనం అటూ, ఇటూ తిరుగుతున్నారు.

సత్యనారాయణగారు చుట్టను ఆఖరుసారిగా, బిగువుగాపీల్చి అవతలపారేసి అన్నాడు: ‘ఏమండీ మన ప్రకాశంగారు ప్రధానిగావున్నప్పుడు ఎవరో కమ్యూనిస్టులు, ఒక పెద్ద దొంగవ్యాపారస్థుణ్ణి ప్రభుత్వానికి పట్టిచ్చారనే వార్తను మీరు పత్రికల్లో చదివేవుంటారు. అప్పుడు నాఫొటోకూడా తెలుగు దినపత్రికల్లో వేశారు. ఆ వ్యాపారస్థుణ్ణి నేనే నండీ! ఇప్పుడన్నా గుర్తొచ్చానా!’

ఈ విషయం సత్యనారాయణగారుచెప్పేవరకు నాకు తెలియంది. నాకెలా తెలుస్తుంది? ‘నాకింకా గుర్తూ రాలేదండీ’ అని అతనివేపు ఆశ్చర్యంగా చూచాను. సత్యనారాయణగారికి నా యందు మాత్రం నిర్లక్ష్యం కలగనందుకు తప్పకుండా అభినందించా లనిపించింది.

'ఇటీవల మన పత్రికల్లో మరో వార్త పడింది చదివారూ?'

'లేదండీ ఏమి టా వార్త?' అన్నాను.

'సత్యనారాయణ గారనే ప్రఖ్యాత సంఘ సంస్కర్తగారి ధర్మపత్ని భర్త పెట్టే యమయాతనలు పడలేక బావిలోపడి ఆత్మహత్య చేసుకుంది అన్న ఈవార్తను బహుశా మీరు చదివేవుంటారు. ఆమె నాభార్యేనండీ. ఇప్పటికైనా నా గుర్తొచ్చానా?'

సత్యనారాయణగారు నాకింతవరకు ఎవరో తెలియకపోయినా, ఒక ప్రశ్న అడగాలని పించింది. 'ఏమండీ, మీరు స్త్రీస్వాతంత్ర్యోద్యమాన్ని నడిపానంటిరికదా, అలాంటి మీ భార్య యాతనలుపడలేక ఆత్మహత్యకు దిగిందంటే, ఎంత అపఖ్యాతిలో ఆలోచించారూ?'

'ఇందులో నాతప్పు ఆవంత అయినా లేదంటే నమ్మండి. ఆమెను స్వాతంత్ర్యం తీసుకోమని, బానిసప్రవృత్తి వదులుకోమని ఎన్నోసార్లు చెప్పేను. కాని ఆమె వినలేదు. నాకు ఒళ్లుమండి కొట్టేవాణ్ణి. ఆ దెబ్బలు భరించలేక ఆమె, బావి గోడ్డుకి ప్రాణదాతల పేరు నిలబెట్టింది." ఇన్నిరంగాల్లో దేశ మొత్తంగా ఖ్యాతిని ఆర్జించిన సత్యనారాయణగారు ఎవరా అని తీక్షణంగా ఆలోచించాను. బ్యాంకిపుస్తకాల్లో సత్యనారాయణ అనే ఒక పెద్ద మనిషి పేర ఒక ఖాతావుంది. ఆ వ్యక్తి తానే నేమోనని అడిగాను; "మీకు ఆంధ్రబ్యాంకిలో ఖాతావుందా సార్."

"అవునండీ!"

"మొన్న మీ పేరుతో ఒచ్చిన, ఒక వోవర్ డ్రాఫ్టుచెక్కు ఒకటి తిరగకొట్టి పంపాము, అది మీదేనా!"

"అవునండీ, ఇప్పటికైనా మీకు నేను గుర్తు ఒచ్చినందుకు గర్వపడుతున్నా" అని సత్యనారాయణగారు పెద్దగా నవ్వాడు.

"మిమ్మల్ని జీవితంలో ఇక ఎప్పటికి మరచి పోనండి" అన్నా, చివరికి. ఒకరికి ఒకరం నమస్కారాలు చెప్పుకుని పార్కుదాటి ఇవతలకువచ్చి, ఎవరి దారిన వారం వెళ్లాము.


# మీ పసిబిడ్డకు ఆయురభివృద్ధి కలిగించండి



పిల్లల లివర్, స్ప్లీను వ్యాధులందు, వ్యాధి ముదిరి కుదురుట కష్టము అని నిరాశగైన అవస్థలోకూడ, కుదుర్చుటలో పేరెన్నిక గన్నది అమృతాంజనం వారి "లివర్ క్యూర్" మాత్రమే. ఇది వైద్యుల సంపూర్ణ నమ్మకము పొందియున్నది.

అమృతాంజనం వారి **లివర్ క్యూర్**

పసిపిల్లల లివర్, స్ప్లీను వ్యాధి నివారణకు జగద్విఖ్యాతమైనది

## అమృతాంజనం వెంకటరమణయ్య అండ్ సన్స్

మైలాపూరు, మద్రాసు. (ఫోన్ నం. 8139)

సాండ్‌హర్స్టు రోడ్డు, బొంబాయి 4. (ఫోన్ నం. 41593)

ఇతర చోట్లు: లక్నో, బెంగుళూరు, తిరుచునాపల్లి.